

# మానసమయూరి

## - కస్తూరి మురళీకృష్ణ



*(గత సంచిక తరువాయి)*

**'రాత్రి అంత లేటయిందేమిటి?'** ప్రొద్దున్న పిల్లలిద్దరూ వెళ్ళిపోగానే అడిగింది ప్రశాంతి.

'ఫ్రెండు కలిశాడు' ముక్తసరిగా సమాధానం ఇచ్చాడు శరత్.

'ఎవరా ఫ్రెండు?' అడిగింది ప్రశాంతి.

గంటలు గంటలు అన్నీ మరచిపోయి గడిపేంత ఫ్రెండ్లెవరూ శరత్‌కి లేరని ప్రశాంతికి తెలుసు. అదీకాక, ఇన్నేళ్ళు ఓ వ్యక్తితో గడిపిన తరువాత అతడు నిజం చెప్తున్నాడో లేదో గ్రహించటం సులభం. అందుకే రెట్టించింది ప్రశాంతి.

'నాతో స్కూలులో కలసి చదివాడు చాలాకాలం అయిందికదా, చాలా మాట్లాడుకున్నాం' అబద్ధం చెప్పాడు శరత్.

ప్రశాంతి ముఖం చూస్తే ఆమె తాను అబద్ధం చెప్తున్నాడని గ్రహించిందని శరత్‌కు అర్థమవుతూనే ఉంది. కానీ ఎందుకో ఆమెకు నిజం చెప్పాలనిపించటం లేదు.

శరత్ అబద్ధం చెప్తున్నాడని ఆమె గ్రహించింది.

ఒక వ్యక్తికి ఓ విషయం చెప్పాలని లేనప్పుడు అతడిని రెట్టించి అడగటం వల్ల లాభం వుండదు.

అది మరిన్ని అబద్ధాలకు దారి తీస్తుంది. దాని పర్యవసానం మనసులు గాయపడటం. సంబంధాలు దెబ్బతినటం. అందుకే ఇక రెట్టించలేదు ప్రశాంతి. కానీ శరత్ తన దగ్గర 'ఏం దాస్తున్నాడో?' అన్న ఆలోచన ఆమె మనసులో కలిగింది.

మౌనంగా ఆఫీసుకి తయారయి 'పదండి' అంది.

శరత్ కూడా మాట్లాడలేదు. మరో వివరణ ఇవ్వలేదు.

ఈనాటి ఆమె మౌనం భవిష్యత్తులో రాబోయే తుఫానుకు నాందీ ప్రస్తావన అని అతడికి తెలుసు. కానీ 'సమస్య వచ్చినప్పుడు దాని పరిష్కారం ఆలోచించవచ్చులే' అనుకున్నాడు.

'నీకు తెలుసా? మన భాగ్యలక్ష్మి లేదూ, ఆవిడ కూతురు మతాంతర వివాహం చేసుకుందట' శరత్ దగ్గరకు వచ్చి మాటలు కలిపాడు ఓ కొలీగు.

అనాసక్తంగా విన్నాడు శరత్. అతడి మనసులో కూతురు, తన మగ సహాధ్యాయులతో ఉన్న దృశ్యమే కదలాడుతోంది. ఏదో తెలియని బాధ కలుగుతోంది. దానికి ఉపశమనం ఏమిటో తెలియటం లేదు.

రాత్రి శరత్ ఇంటికి వచ్చేసరికి స్రవంతి భోజనం చేసి నిద్రపోయింది.

'బాగా చదివి అలసిపోయి ఉంటుంది' అంది ప్రశాంతి.

దాంతో ఆమెకు నిజం చెప్పి బాధించాలనిపించలేదు శరత్‌కు. అందుకని అబద్ధాలు చెప్పాడు.

'ఏమిటో, ఈ కాలంలో పిల్లలకు ఆవేశం తప్ప ఆలోచనలు ఉండటంలేదు' అన్నాడు కొలీగ్. తల ఊపాడు శరత్.

'మన ఆఫీసులోనే చూడు, రెండు మతాంతర వివహాలు, నాలుగు కులాంతర వివాహాలు ఒక పక్క కులాల వారీగా, మతాల వారీగా మనుషుల మధ్య అడ్డుగోడలు గట్టిపడుతున్నాయి. మరోవైపు ఇలాంటి వివాహాలు పెరుగుతున్నాయి. నువ్వు మేధావిగా, ఇదేమిటో నాకు కాస్త వివరించు' అన్నాడు అతడు.

శరత్ నవ్వి ఊరుకున్నాడు.

తన కొలీగు అన్నమాటలలో సత్యం ఉందని శరత్‌కు తెలుసు.

ఇటీవలి కాలంలో 'కులం' ఆధారంగా విద్వేషాలు ప్రదర్శించటం, దూషించటం ఎక్కువయిపోయింది. ఇదంతా విద్యావంతులయి సామాజికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారే ప్రదర్శించటం కూడా ఎక్కువయింది. వీరిలో మతం మారిన వారే అధికంగా 'దళితులు', అన్యాయాలు, అక్రమాలు, అణచివేతలు అంటూ విమర్శించటం, 'మనువాదం నశించాలి', అంటూ హిందూ ధర్మాలను దూషించటం కూడా అధికమయింది. అయితే కొన్ని విషయాలను బహిరంగంగా అనకపోవటమే మేలు అని శరత్‌కి తెలుసు.

అందుకే పైకి అన్నాడు. 'నాకేమనిపిస్తున్నదంటే, మనం అంతగా కులాలను పట్టించుకోవటంలేదు. కానీ మతం మారిన వారే మన కులవ్యవస్థపై అధికంగా వ్యాఖ్యానిస్తున్నారు. బాధపడి అరుస్తున్నారు'

కొలీగు పెద్దగా నవ్వాడు. 'నేను అదే అందామనుకుంటున్నాను. నాకు తెలిసిన ఓ మహానుభావుడున్నాడు. అతడు రిజర్వేషన్, ఆధారంగా ఓ పెద్ద పొజిషన్ ప్రభుత్వ సంస్థలో సాధించాడు. అతడు వీలు చిక్కినప్పుడల్లా మన పండుగలను హేళన చేస్తాడు. రాక్షసులు దేవతలంటాడు. దేవుళ్ళు అగ్రవర్ణాల వారంటాడు. నరకాసురుడిని చంపటం దళితులపై దాడి అంటాడు. ఓసారి అడిగాను, నరకాసురుడు, విష్ణువుకు భూదేవికి పుట్టినవాడు. దళితుడు ఎలా అయ్యాడని? అదంతా అగ్రవర్ణాల కుట్ర అంటాడు. మనువాదం నశించాలి అంటాడు. ఎక్కడ ఏం జరిగినా అది మనువాదం, అగ్రవర్ణాల కుట్ర అంటాడు. తీరా చూస్తే వాడికి నగరంలో ఎనిమిది ఫ్లాట్లున్నాయి. ఊళ్ళో ఎకరాల కొద్దీ భూములున్నాయి. వాళ్ళ పిల్లలు ఖరీదైన ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నారు. కానీ దళితుడినని అణచివేతకు గురవుతున్నానంటాడు. నేను అడిగా, నువ్వు మతం మారగానే నీ కులం, పోయింది. నీ మతం మారింది. ఇంకా దళితుడనని ఎలా అంటావయ్యా? అని నా మీద విరుచుకు పడ్డాడనుకో. నిజానికి మతం మారిన వాళ్ళే అధికంగా గోల చేస్తున్నారనిపిస్తుంది' అన్నాడు.

'నాకు అదేమిటో తెలియదు కానీ, ప్రతి విషయాన్నీ భూతద్దంలో చూసి, గోరంతలు కొండంతలు చేసి సమాజంలో ద్వేషం వెదజల్లి అడ్డుగోడలు నిర్మించాలని వీళ్ళు చేస్తున్న ప్రయత్నాల వెనుక ఓ ప్రణాళిక ఉందనిపిస్తుంది' అన్నాడు శరత్.

'ఏమిటది?'

'ఆరంభంలో రిజర్వేషన్లు అమలు జరిపినప్పటి తరంలో ఒక రకమైన ఆదర్శం, ఆవేశం ఉండేవి. ఒక తరం పోయి, రెండో తరం వచ్చేసరికి పరిస్థితులు మారాయి. రిజర్వేషన్ లబ్ధిపొంది పైకి వచ్చిన వారు వారి తరువాత తరం ఇంకా లాభం పొందుతూనే ఉన్నారు. కానీ లబ్ధిపొందనివారు, ఇన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలియని వారు అలానే ఉన్నారు. ఇంకా దిగజారారు. ఇంకో రెండు తరాలు పోయేసరికి ఆదర్శాలు, ఆవేశాలు పోయాయి. జీవిత సమస్యలు ముందుకు వచ్చాయి. రిజర్వేషన్‌ని వారికి తామేదో నష్టపోతున్నామన్న ఆలోచన పెరిగింది. ఉన్నవారికి తమ సౌకర్యం పోగొట్టుకోవటం ఇష్టంలేదు. లేనివారికి సౌకర్యం అందటమే లేదు. ఇదిగో, ఈ ద్వైదీభావనల నడుమ, స్వార్థాల నడుమ, జీవిత సమస్యల వల్ల సమాజంలో మళ్ళీ 'కుల' భావన చెలరేగుతోంది. ఇలాకాక రెండు తరాలు రిజర్వేషన్ లబ్ధిపొందినవారు స్వచ్ఛందంగా తమకు ఎలాంటి ఊతకర్ర అవసరంలేదు అన్న ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తే, రిజర్వేషన్లు

లేని వారు కావాలని గోలచేయటం, వారి గోల చూసి తమదేదో పోతుందని వీళ్ళు గోల చేయడం తగ్గదు. ఈ గోలల నడుమ ఇంతవరకూ లబ్ధిపొందని వాడు అలాగే ఉంటున్నాడు. సమస్య జటిలం అవుతోంది తప్ప పరిష్కారం కావటంలేదు.‘ అన్నాడు శరత్.

‘ఓహో.. అందుకేనా. ఓ యూనివర్సిటీ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే దానికి పెద్ద గోల చేశారు, అతడు దళితుడు కాడని తెలిసీ, అతడి ఆత్మహత్యకూ అణచివేతకూ సంబంధం లేదని తెలిసికూడా! ఇక ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకోలేదు.‘

‘అంతా రాజకీయం - స్వార్థం.. కొందరు ప్రభుత్వాఫీసులలో లంచ్ సమయాల్లో అన్నం తినే సమయంలో వివక్షత చూపుతారనీ, బొట్టు పెట్టే విషయంలో ఓ ఇష్యూ చేస్తారనీ కథలు రాస్తున్నారు. వాటిని పొగిడేసి గొప్ప ‘నిజం‘ జీవితం వారు కథల్లో చూపుతున్న దానికి భిన్నంగా ఉంది. ఈ నిజం కథలలో ప్రదర్శించే ధైర్యం ఏ రచయితా చేయటంలేదు. చేసినా వారికి ఆదరణ లభించదు.‘

‘ఏమిటా నిజం?‘

‘నా స్వీయానుభవం చెప్తాను. మా పాప నాలుగో తరగతి చదివేటప్పుడు దానికి ఓ ఫ్రెండు ఉండేది లూసీ అని. లూసీ ఓ నాలుగు రోజులు స్కూలుకు రాలేదు. ఎందుకంటే బైబిల్ క్లాసులు జరిగేయట. ప్రొద్దున్నే ఓ బస్సొచ్చి పిల్లలందరినీ చర్చికి తీసుకు వెళ్తుంది. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, అక్కడే సాయంత్రం మళ్ళీ ఇంటికి తెచ్చి దింపుతారు బస్సులో. ఆ నాలుగు రోజులు పిల్లలకు బైబిల్ పాఠాలు, దైవ సంబంధిత విషయాలు, క్రిష్టియన్ల నడవడి నేర్పుతారట. అది అయిన తరువాత మా అమ్మాయి ఆ ఫ్రెండుతో ఆడటానికి వెళితే ‘నువ్వు క్రిష్టియన్‌వి కావు. నీతో ఆడటం పాపం‘ అందట లూసీ. ఏడుస్తూ ఇంటికి వచ్చింది మా అమ్మాయి. ‘నన్ను ఆడనివ్వటంలేదు. మనం ఎందుకు క్రిష్టియన్లం కాము?‘ అని ఏడ్చింది. అప్పటివరకు మా పాపకు హిందూ, క్రిష్టియన్ అన్న పదాలు తెలియవు. ఆ తరువాత ఓ రోజు మా ఇంటికి వచ్చింది లూసీ. మీరీ దేవుళ్ళని ఎందుకు పూజిస్తారు? ఇదంతా అబద్ధం... మూర్ఖత్వం అంటూ లెక్చరిచ్చింది. అంతేకాదు, పాటలు పాడమంటే క్రిష్టియన్ల భజన గీతాలు పాడింది. అప్పుడు అనిపించింది నాకు ప్రతి మతానికి వాళ్ళ మతం గురించి చిన్నప్పటి నుంచే చెప్పే వ్యవస్థ ఉంది. క్రిష్టియన్లకు బైబిల్ పాఠాలు, ముస్లింలకు మదర్సాలు ఉన్నాయి. మనం మన పిల్లలకు దైవం గురించి ఏం చెప్తాం? ఎప్పుడు చెప్తాం? ఒక పద్ధతి ప్రకారం వాళ్ళకి తెలిసే వీలు లేదు. అందుకే వాళ్ళు తాము ఏమిటో తెలియకుండా పెరుగుతున్నారు. ధర్మాన్ని కాదనటం గొప్పగా భావిస్తున్నారు. అదే ఇతర మతాలలో మతానికి ప్రాధాన్యం. మనకు కాదు. పైగా ధర్మభంగం గొప్పతనం. మన ధర్మాన్ని మన పిల్లలు వాళ్ళంతట వాళ్ళు తెలుసుకోవాల్సి వస్తోంది. కానీ అప్పటికే జరిగే నష్టం జరిగిపోతోంది. మనల్ని మనం చులకన చేసుకుని, న్యూనతా భావానికి గురయ్యే స్థితికి చేరుకుంటున్నాం. ఇది నీకు ఎవ్వరూ ఎక్కడా చెప్పరు. ఇదిగో ఇక్కడి నుంచే మన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మన ధర్మాల్ని తిట్టినా, దేవుళ్ళని తిట్టినా, ధర్మగ్రంథాలను దూషించినా మనం సమాధానం ఇచ్చి స్థితిలో లేము. కనీసం వాటిని సమర్థించే స్థితిలోనూ లేము. ఎందుకంటే మన ధర్మం గురించి మనకేమీ తెలియదు. వాడు వక్ర దృష్టితో చూసి చేసిన ఆరోపణలే నిజం అనుకునే మూర్ఖ అజ్ఞాన దశలోనే ఉన్నాం మనం.‘ ఆవేశంగా చెప్తాడు శరత్.

అంతవరకూ మౌనంగా విన్న అతడి లేచాడు. ‘నువ్వింత మత తత్వవాదివి అనుకోలేదు. నువ్వు ఆరెస్సెస్ వాడివని నాకు తెలియదు‘ అని గబగబా వెళ్ళిపోయాడు. ఆశ్చర్యపోయాడు శరత్. ఇంత వరకూ బాగానే మాట్లాడినవాడు ఇప్పుడిలా అంటాడేమిటి? హఠాత్తుగా మత తత్వం, ఆరెస్సెస్ ఎక్కడినుంచి వచ్చాయి?

‘ఏం సార్.. ఏమంటున్నాడు మను లక్ష్మీనారాయణ?‘ అంటూ వచ్చాడు ఇంకో కొలీగు.

ఆశ్చర్యం నుంచి తేరుకోని శరత్ జరిగినదంతా చెప్పాడు.

అంతా విని నవ్వాడు అతడు. ‘మీరు లక్ష్మీనారాయణ గురించి తెలిసినట్టులేదు. అతడు కన్వర్టు. ఇటు రిజర్వేషన్ లబ్ధి పొందుతున్నాడు. ఇలా మాట్లాడి ఎదుటివాడి మనస్సు గ్రహిస్తాడు. ఇక మీ జోలికిరాడు. అతడు మన ఆఫీసులో క్రిష్టియన్

అసోసియేషన్‌లో ఆఫీసరు బేరర్. జాగ్రత్త. ఇంకోసారి మనసులో మాటలు ఇలా బయటకు చెప్పకండి. మళ్ళీ మీరు అవమానించారని ఎస్సీ ఎస్టి ఏట్రో సిటీస్ ఏక్ట్ క్రింద కేసు పెట్టగలడు'

శరత్ ఆశ్చర్యం 'షాక్'గా మారింది. 'క్రిష్టియన్. అయినా లక్ష్మీనారాయణ అన్న పేరు.'

'మారదు. రిజిష్టరులో అతనిపేరు కె.లక్ష్మీనారాయణ. కొండలపల్లి లక్ష్మీనారాయణ. లాభాలు పొందేటప్పుడు వేరు. మతం ప్రసక్తి వస్తే వేరు.' శరత్ ఆశ్చర్యం చూసి పెద్దగా నవ్వుతూ వెళ్ళిపోయాడు అతడు.

చాలాసేపు అలా ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు శరత్.

తాము విద్యావంతులు. మానసిక పరిణతి రావాల్సి వయసులో ఉన్నవారు. కానీ తమ నడుమనే ఇన్ని అడ్డుగోడలు, మోసాలు, ద్వేషాలు.. స్వార్థం అన్ని బంధాలను, కప్పిపెడుతోంది.

అలాంటిది ఇంకా ముక్కుపచ్చలారని యువతీయువకులు ఈ విద్వేషాలను, ఈ విషాగ్నులను ఎలా తట్టుకోగలరు?

అతడి మనసులో భాధ మరింత పెరిగింది.

తామూ తమ సంతానం కోసం ఎలాంటి సమాజాన్ని తయారు చేస్తున్నారు?

ఈ ఆలోచనలు తాత్కాలికంగా అతడి మనసులోంచి స్రవంతికి సంబంధించిన ఆలోచనలను వెనక్కు నెట్టాయి.

అతని ఆలోచనలను భంగం చేస్తూ సెల్‌కు మెసేజ్ వచ్చింది.

చూశాడు. శిల్ప నుంచి వచ్చింది.

Never get too much attached to anyone unless they feel the same towards you, because, one sided appectations can mentally destroy you.

అది చూడగానే బాధ అనిపించింది.

వెంటనే శిల్పకు ఫోను చేయాలనిపించింది.

కానీ పలురకాల విభిన్నమైన సందిగ్ధితిలో కొట్టిమిట్టాడుతున్న మానసిక స్థితిలో ఉన్న అతడి మరో సందిగ్ధాన్ని కొని తెచ్చుకోదలచుకోలేదు. అతి కష్టం మీద శిల్పకు ఫోను చేయాలన్న కోరికను అణుచుకున్నాడు. లక్ష్మీనారాయణతో కలిగిన అనుభవంతో అతడి మనసు పాడయిపోయింది. సాధారణంగా ఎవ్వరితో మనసు విప్పి మాట్లాడాడు శరత్. అలాంటిది ఎందుకో మాట్లాడాడు.

కానీ తాను మాట్లాడిన ప్రతిమాట నిజం అని శరత్‌కి తెలుసు.

ఇతరులకు వాళ్ళ మతం గురించి చిన్నప్పటి నుంచే బోధిస్తారు. కానీ త్తమ ధర్మంలో అలాంటి వ్యవస్థలేదు. తల్లిదండ్రులకే ధర్మం తెలియదు. కష్టం కలిగినప్పుడు మొక్కుతుంటావు. శాంతులు చేయిస్తారు. ఆ తరువాత 'అంతా మూర్ఖత్వం' అని వాదిస్తారు. పెద్దలకే తెలియదు. పిల్లలకు ఏం మార్గదర్శకతం చేస్తారు? తమ ప్రమేయం లేకుండానే తమ జీవితాలు ఓ చట్రంలో బిగుసుకుపోయాయి. దాన్లో ఇమడలేరు. బయటకు రాలేరు.

తన చుట్టూ ఉన్న మనుషులను చూస్తూంటే ఈ భావన బలపడుతోంది ఇంతలో ఏదో మెసేజ్ వచ్చింది.

తీసి చూశాడు.

శిల్పనుంచి

ఓ హిందీ పాట పంపింది.

చూశాడు.

లతా మంగేష్కర్ స్వరం అతని హృదయాన్ని తట్టింది.

వో జో మిల్‌తే థె కభీ హై మెరీ నిగాహోం మె కభీ

అజ్ యూ మిల్తె హై జైసె కభీ పహెచాన్ నహీ

అతడు నన్ను ఒకప్పుడు పిచ్చివాడిలా, నన్ను విడచి ఉండలేని వాడిలా కలిసేవాడు. ఇప్పుడు అసలు పరిచయం లేని వాడిలా కలుస్తున్నాడు.

దేఖ్‌తె భీ హై మెరీ నిగాహోం మె కభీ

అజ్‌నబీ జైసె మిలా కర్తే హై రాహోం మె కభీ

ఇస్ కదర్ ఉన్ కీ నజర్,

ఒకప్పుడు కళ్ళను చూడకుండా ఉండలేకపోయేవాడు. దారుల్లో అపరిచితుడిలా కలిసేవాడు. అతడి కళ్ళకు నేను ఇంతగా అపరిచితను కాదేమో!

శరత్ హృదయం మెలిపెట్టినట్టయింది.

ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

పాట మళ్ళీ మళ్ళీ విన్నాడు.

ఎంత అద్భుతమైన భావన. ఎంత తపన పడి వుంటే ఇలాంటి భావనను అంత సుందరంగా అక్షరాలలో పొదగటం సాధ్యమవుతుంది.

లతా స్వరం ప్రతి అక్షరానికీ ఎంతో లోతునిస్తూ, భావాన్ని పలవరిస్తూ ధ్వనిస్తోంది. శిల్ప మనసులో భావనలను లత పలుకుతోంది.

కానీ... ఇక ఆగలేకపోయాడు శరత్.

గబగబా ఆమె నెంబర్లు నొక్కాడు. సెండ్ దగ్గర ఒక్క సెకను ఆగాడు.

'ఆగారేం? ఫోను చెయ్యండి' శిల్ప స్వరం వినిపించింది.

ఆశ్చర్యంగా తలె ఎత్తాడు శరత్.

'తూ ఖామోష్ క్యూ హై యే మాలూమ్ నహీ మాగర్,

దిల్ డూబ్ సజాతా హై జబ్ తూ ఖామోష్ హోతాహై' అంది నవ్వుతూ

'నువ్వు మౌనం ఎందుకు వహించావో తెలియదు కానీ, నువ్వు మౌనంగా ఉంటే నా మనసు దుఃఖంలో మునిగిపోతుంది.'

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*

Post your comments